## • ఉద్యోగాల భర్తీలో అన్యాయంపై నిరసన




పోలీస్ ఉద్యోగాల భర్తీలో జరుగుతున్న అన్యాయాన్ని నిరసిస్తూ నిరుద్యోగ యువత, పోలీస్ ఉద్యోగార్థులు గురువారం కరీంనగర్‌లోని తెలంగాణచౌక్‌లో భారీ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. పోస్టుల భర్తీలో ప్రభుత్వ జాప్యంతో వేలాదిమంది నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. త్వరలో విడుదల చేయనున్న నియామక నోటిఫికేషన్‌లో 20 వేల ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. -కరీంనగర్ కలెక్టరేట్

## • ఒకటో తేదీనే జీతాలు చెల్లించాలి



ప్రభుత్వ దవాఖానల్లో పనిచేస్తున్న వారికి ఒకటో తేదీనే జీతాలు చెల్లించాలని కాంట్రాక్టు శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులు డిమాండ్ చేశారు. గురువారం కోఠి హెల్త్ క్యాంపస్‌లోని డీఎంఈ కార్యాలయం ఎదుట తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. భారీస్థాయిలో చేరుకున్న కార్మికులతో డీఎంఈ కార్యాలయ ప్రాంగణం నినాదాలతో మారుమోగింది. డీఎంఈ నరేందర్ కుమార్ వచ్చి సమస్యలు పరిష్కరిస్తామని హామీఇచ్చారు. -హైదరాబాద్/సుల్తాన్‌బజార్

## • ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రెండోరోజు నిరసన




యాదాద్రి పవర్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ(టీజీపీఈజేఏసీ) ఆధ్వర్యంలో కరీంనగర్ సర్కిల్ కార్యాలయ ఉద్యోగులు రెండో రోజు గురువారం నల్ల బ్యాడ్జీలు ధరించి ఎస్ఈ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. - కరీంనగర్ ముకరంపుర



నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట ఏరియా దవాఖానలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శిస్తున్న ఆర్డీవో, అధికారులు

# గురుకులంలో ఫుడ్ పాయిజన్

### అల్పాహారం తిన్న రెండు గంటలకే 26 మందికి కడుపునొప్పి, వాంతులు

### మన్ననూరు ప్రాజెక్టు ట్రైబల్ వెల్ఫేర్ బాలుర గురుకులంలో ఘటన

అచ్చంపేటటౌన్/అమ్రాబాద్, జూలై 9 : నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూరులో ప్రాజెక్టు ట్రైబల్ వెల్ఫేర్ బాలుర గురుకులంలో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. గురువారం ఉదయం అల్పాహారంలో కిచిడీ తీసుకున్నారు. తర్వాత కొద్దిసేపటికే ఆహారం వికటించి 26 మంది అస్వస్థతకు గురయ్యారు. పాఠశాల ప్రిన్సిపాల్ పద్మావతి, సిబ్బంది హుటాహుటిన అచ్చంపేట ప్రభుత్వ ఏరియా దవాఖానకు విద్యార్థులను తరలించారు. 26 మంది విద్యార్థుల్లో చరణ్, గణేశ్, రామాంజనేయులు వాంతులతో.. మిగిలినవారు కడుపునొప్పితో బాధపడుతూ వచ్చారని డాక్టర్ మహేశ్ తెలిపారు. వారంతా కోలుకోవడంతో డిశ్చార్జి చేసినట్టు చెప్పారు. దవాఖానలో సరిపడా బెడ్లు లేకపోవడంతో విద్యార్థులను నేలపై పడుకోబెట్టి చికిత్స అందించారు. అదనపు కలెక్టర్ దేవసహాయం, అచ్చంపేట ఆర్డీవో యాదగిరి, డీఎస్పీ శ్రీనివాసులు అచ్చంపేట దవాఖానకు చేరుకొని విద్యార్థులను పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. పూర్తి విచారణ అనంతరం బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. మన్ననూర్ పాఠశాలలో నీటి, ఆహార నమూనాలను ఫుడ్‌ఇన్‌స్పెక్టర్ సేకరించారు. గురుకులంలో సిబ్బంది నిర్లక్ష్యంతోనే ఇలా జరిగిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. చికిత్స పొందిన విద్యార్థులను బీఆర్‌ఎస్ నాయకులు పరామర్శించారు. మిషన్ భగీరథ పైపు పగిలిపోవడంతో నీళ్లు రావడం లేదని, గురుకులంలోని బోరు నీటినే విద్యార్థులు తాగడంతో విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు.

## అంగన్‌వాడీలో కుళ్లిన గుడ్లు

### తల్లిదండ్రుల మండిపాటు



భీమారం, జూలై 9 : మంచిర్యాల జిల్లా భీమారంలోని అంగన్‌వాడీ సెంటర్ – 5, – 2లో కుళ్లినగుడ్లు, ముక్కిన పప్పుతో భోజనం వడ్డించడంపై చిన్నారుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కాగా, సూపర్‌వైజర్ సుప్రిత గురువారం అంగన్‌వాడీ సెంటర్లను పరిశీలించారు. కుళ్లిన కోడిగుడ్లు, పురుగులు పట్టి ముక్కిన పప్పు ఉండడం నిజమేనని తెలిపారు. అంగన్‌వాడీ టీచర్ సరళ బంధువులు చనిపోతే బయటకు వెళ్లిందని, మరో టీచర్ మణిమాలకు బీపీ డౌన్ అయ్యిందని వెల్లడించారు. అంగన్‌వాడీ టీచర్లు ఉన్నతాధికారుల అనుమతులు తీసుకోకుండానే విధులకు గైర్హాజరవుతున్నారని, ఇంత జరిగినా సూపర్‌వైజర్ ..టీచర్లకు, హెల్పర్లకు మద్దతు తెలుపుతున్నారని తల్లిదండ్రులు మండిపడుతున్నారు.

# నీళ్ల బాటిల్‌కు రూ.3,489

- రాష్ట్రంలో మంత్రుల సరదాలకు కోట్లు.. విద్యార్థుల సంక్షేమానికి తూట్లు
- ఫుట్‌బాల్, అందాల పోటీలకూ కోట్లు..
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీ ట్రిప్పులకు రూ.400 కోట్లు
- ఆటోల్లా హెలికాప్టర్ల వాడకం
- ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు మాత్రం ఎగనామం : బీఆర్‌ఎస్ నేత రాకేశ్‌రెడ్డి




హైదరాబాద్,జూలై 9 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో సీఎం, మంత్రుల సరదాలకు కోట్లు.. అన్ని వర్గాలకు తూట్లు అన్నట్టుగా పరిస్థితి తయారైందని బీఆర్‌ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి విమర్శించారు. గురువారం తెలంగాణ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి తన మనవడు సరదా తీర్చేందుకు కోట్లు ఖర్చు చేసి మెస్సీతో ఫుట్‌బాల్ మ్యాచ్ పెట్టించారని , తన సరదా కోసం అందాల పోటీలు పెట్టారని మండిపడ్డారు. రూ. 42 వేల టీషర్ట్, రూ. 90 వేల బూట్లు, రూ. 6 లక్షల హెర్మన్ జాకెట్ వాడుతూ రేవంత్‌రెడ్డి చీఫ్ మినిస్టర్‌గా కాకుండా కాస్ట్లీ మినిస్టర్‌గా మారిపోయారని ఎద్దేవా చేశారు. సీఎం ఇలా ఉంటే తామేం తక్కువ.. అన్నట్టుగా మంత్రులు అదే కోవలో నడుస్తున్నారని ధ్వజమెత్తారు. మంత్రి భట్టి విక్రమార్క తాగే నీటి బాటిల్‌కు రూ. 3,489 ఖర్చు చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజల సొమ్మును అప్పనంగా ఖర్చు చేస్తూ విద్యార్థులకు ఇచ్చే ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు మాత్రం తూట్లు పొడుస్తున్నారని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి 70 సార్లు ఢిల్లీకి వెళ్లి రూ. 400 కోట్లు ఖర్చు చేస్తే.. మంత్రులు ఆటోల్లా హెలికాప్టర్లను వాడుతూ వృథా ఖర్చు చేస్తున్నారని చురకలంటించారు. ఈ ఖర్చుతో విద్యార్థులకు ఒక ఏడాది ఫీజు రీయింబర్స్‌మెంట్ వేయొచ్చని తెలిపారు. వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కొనసాగించారని గుర్తు చేశారు. కానీ ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం బకాయిలతో మాకేం సంబంధం అన్నట్టు వ్యవహరించడం సరికాదని విమర్శించారు. బకాయిలు రాకపోవడంతో ప్రైవేట్ విద్యాసంస్థలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్నాయని పేర్కొన్నారు. యూనివర్సిటీల భూములను అమ్ముకోవడానికి చూపుతున్న ముందడుగు, ఈ విద్యాసంస్థలను కాపాడటంలో లేకపోవడం దారుణమని మండపడ్డారు.

**తెలంగాణలో దోపిడీ.. ఢిల్లీకి మూటలు..**

రాష్ట్రంలో దోపిడీ చేసిన సొమ్మును ఢిల్లీకి కప్పంగా తరలిస్తున్నారని రాకేశ్‌రెడ్డి విమర్శించారు. మంత్రుల కాంట్రాక్ట్ కంపెనీలకు మాత్రం బిల్లులు చకచకా చెల్లిస్తున్నారని, కమీషన్లు వసూలు చేస్తూ ఢిల్లీకి మూటలు మోస్తున్నారని ఆరోపించారు. మూసీ పునరుజ్జీవం, ఫ్యూచర్ సిటీ అంటూ లక్షల కోట్లు ఎవరి కోసం ఖర్చు పెడుతున్నారని ఆయన నిలదీశారు. ప్రభుత్వాల వైఫల్యాలు, ప్రజా అసంతృప్తి వల్లే సమాజంలో 'కాక్రోచ్' లాంటి కొత్త రాజకీయ శక్తులు పుట్టుకొస్తున్నాయని రాకేశ్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో విద్యార్థుల సమస్యలపై బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం (బీఆర్‌ఎస్వీ) రాజీలేని పోరాటం చేస్తున్నదని పేర్కొన్నారు. దీనిపై త్వరలోనే అన్ని విద్యార్థి సంఘాలతో కలిసి రౌండ్ టేబుల్ సమావేశాలు ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని రద్దు చేస్తే, రాష్ట్రంలో 'జెన్‌జీ' ఆధ్వర్యంలో భారీ ఉద్యమాలు పుట్టుకొస్తాయని హెచ్చరించారు.




తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్. చిత్రంలో బీఆర్‌ఎస్ నాయకులు

# హరీశ్ సవాల్‌పై స్పందించరేం!

- రైతులకు నీళ్లిచ్చేందుకే హరీశ్ ఆరాటం
- 24గంటలైనా స్పందించని మంత్రులు
- కాంగ్రెస్ నేతలు ప్రేలాపనలు మానుకోవాలి
- జగ్గారెడ్డికి మళ్లీ ఓటమి భయం పట్టుకొన్నది
- ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల

హైదరాబాద్, జూలై 9 (నమస్తే తెలంగాణ): 'వృథాగా సముద్రంలో కలుస్తున్న గోదావరి జలాలను మళ్లించి రైతుల గోస తీర్చాలన్నదే బీఆర్‌ఎస్ శాసనసభా పక్ష ఉపనేత హరీశ్‌రావు ఆరాటం. అందుకే మూడు నెలలు ఇరిగేషన్ మంత్రిగా అవకాశమిస్తే చేసి చూపుతానని సవాల్ విసిరారు. 24గంటలు దాటినా చేతగాని మంత్రులు ఆ సవాల్‌ను స్వీకరించలేదు' అని ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పెద్దలకు రైతులపై నిజమైన ప్రేమ ఉంటే వెంటనే వృథాగా పోతున్న జలాలను ఒడిసిపట్టాలని డిమాండ్ చేశారు. హరీశ్ సవాల్‌ను స్వీకరించే దమ్ములేని మరికొందరు కాంగ్రెస్ నేతలు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. గురువారం హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ రాష్ట్ర నేతలు గోసుల శ్రీనివాస్, అభిలాశ్ రంగినేని, వాసుదేవారెడ్డి, సుమిత్రా ఆనంద్, దూసరి శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి అపాయింట్‌మెంట్ కోసం హరీశ్‌రావుపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమంలో బ్రోకర్ పాత్ర పోషించిన కాంగ్రెస్ నేతలకు హరీశ్‌రావు గురించి మాట్లాడే నైతిక అర్హత ఎక్కిడిదని ప్రశ్నించారు. మహారాష్ట్రతో 152 మీటర్ల ఎత్తులో తమ్మిడిహట్టి వద్ద బరాజ్ నిర్మాణానికి అగ్రిమెంట్ జరిగిందని సీఎం, మంత్రులు లీకులిస్తున్నారని, ఆ ఒప్పందం నిజమైతే తెలంగాణ ప్రజల ముందు దానిని బట్టబయలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌కు స్కామ్‌లు తప్ప ప్రాజెక్టులు, పథకాలపై ధ్యాసేలేదని దెప్పిపొడిచారు. అందుకే పరిజ్ఞానమే లేని టెక్నీషియన్‌తో దేవాదుల పంప్‌హౌస్‌ను ఆన్‌చేసి విఫలమయ్యారని మండిపడ్డారు. కాంగ్రెస్ సర్కార్‌కు మేడిగడ్డ మరమ్మతుపై ఎలాంటి ప్రణాళికలేదని విమర్శించారు.

### మూడేండ్లలో మూడు పార్టీలు మారిన జగ్గారెడ్డి

'హరీశ్‌రావు కాలిగోటికి కూడా సరిపోని మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డికి గడ్డం పెరిగింది కానీ, బుర్ర పెరుగలేదు. మూడేండ్లలో మూడు పార్టీలు మారిండు. అందుకే సంగారెడ్డిలో ఇక గెలువనని తెలిసి పోటీ చేయనంటూ పారిపోతున్నడు' అంటూ ఎర్రోళ్ల శ్రీనివాస్ మండిపడ్డారు. సంగారెడ్డిలో హరీశ్‌రావు అడుగుపెడితే ఏదో చేస్తామంటూ ఆయన నోటికొచ్చినట్టు మాట్లాడటం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. రెండేండ్ల కిందట కొట్టిన దెబ్బకు ఇంకా తేరుకోని ఆయన మతిలేకుండా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులు ఎక్కడ ఉన్నాయో.. గోదావరి ఎక్కడి నుంచి పారుతుందో తెలియని జగ్గారెడ్డి.. ప్రాజెక్టులు నింపితే భద్రాచలం కొట్టుకుపోతుందని మాట్లాడటం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. 2009లో తెలంగాణ కోసం కేసీఆర్ దీక్ష చేస్తే జగ్గారెడ్డి వ్యతిరేక శక్తులతో చేతులు కలిపారని ఆరోపించారు.



చిలుకూరులో మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్, బీఆర్‌ఎస్ నాయకులు

## మట్టి మాఫియాకు అడ్డాగా కోదాడ

- మాజీఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

చిలుకూరు, జూలై 9: మట్టి మాఫియాకు సూర్యాపేట జిల్లా కోదాడ అడ్డాగా మారిందని కోదాడ మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బొల్లం మల్లయ్యయాదవ్ విమర్శించారు. గురువారం చిలుకూరులో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు బెల్లంకొండ సైదులు నివాసంలో మీడియాతో ఆయన మాట్లాడారు. కోదాడ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తానని చెబుతున్న ఉత్తమ్ దంపతులు అక్రమాలను ప్రోత్సహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కోదాడ మట్టి, ఇసుక, గంజాయి వ్యాపారాలను నిలయంగా మారిందని తెలిపారు. పోలీస్, రెవెన్యూ, ఇరిగేషన్, మైనింగ్ అధికారుల అండదండలతో కొంతమంది బినామీల ద్వారా ఉత్తమ్ దంపతులు కోట్ల రూపాయలు వెనుకేసుకుంటున్నారని ఆరోపించారు.

## రైతులకు ప్రోత్సాహక నిధులు ఇవ్వాలి

- రాష్ట్రరైతు సంఘం ప్రధాన కార్యదర్శి పద్మ

హైదరాబాద్, జూలై 9 (నమస్తే తెలంగాణ) : ఎల్ నినో ప్రభావంతో వరికి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసే రైతులకు రూ.8వేల ప్రోత్సాహక నిధులు కేటాయించాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీ పద్మ డిమాండ్ చేశారు. గురువారం ఆమె మాట్లాడుతూ వానలు లేక రైతులు వేసిన పత్తి విత్తనాలు 30శాతం మొలకెత్తలేదని పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండల పరిధిలో 1,057 సర్వే నంబర్‌లో 113 ఎకరాలు భూదాన్, 120 ఎకరాల పట్టా భూములను మైహోమ్ సిమెంట్ ఫ్యాక్టరీ యజమాని కొని వ్యవసాయేతర భూములుగా మార్చి రూ.1,030 కోట్ల లోన్ తీసుకున్నట్టు ఆరోపించారు. బ్యాంకులు పరిమితులను దాటి లోన్ ఇవ్వటంపై విచారణ జరుపాలని డిమాండ్ చేశారు. జూలై 18, 19, 20 తేదీల్లో యాదగిరిగుట్టలో రైతులకు రాష్ట్రస్థాయి శిక్షణ ఇస్తున్నట్టు పద్మ తెలిపారు.


**అమ్మకం ప్రకటన - సహిత - ఇ-వేలం**
**భారత ప్రభుత్వం, ఆర్థిక మంత్రిత్వ శాఖ, ఆర్థిక సేవల శాఖ**
**డెట్స్ రికవరీ ట్రిబ్యునల్-2, హైదరాబాద్ వద్ద**
1వ అంతస్తు, త్రివేణి కాంప్లెక్స్, అబిడ్స్, హైదరాబాద్-500001. ఫోన్ నెం. 040-24756467

**RP No. 604/2019** **తేది: 02-07-2026**

**రికవరీ ఆఫ్ డెట్స్ డ్యూ టు బ్యాంక్స్ అండ్ ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్స్ యాక్ట్, 1993తో చదువబడే ఆదాయ పన్ను చట్టం, 1961కు రెండవ షెడ్యూల్‌లోని రూల్స్ 38, 52(2) క్రింద అమ్మకం ప్రకటన**

**(CH 1) పంజాబ్ & సింద్ బ్యాంక్,** M.G. రోడ్, సికింద్రాబాద్, ప్రాతినిధ్యం వహిస్తున్నవారు దాని మేనేజర్ **...సర్టిఫికెట్ హోల్డర్**

**(CD 1) మెసర్స్ రెడ్ సఫైర్ రెస్టారెంట్ అండ్ బార్, ఒక భాగస్వామ్య సంస్థ,** ప్రాతినిధ్యం వహిస్తున్న దాని పార్ట్‌నర్స్ ఎ.శ్రీనివాస రావు మరియు బి.నారాయణ, 1-1-111 మరియు 112, ఎవిఎస్ కాంప్లెక్స్, ఆర్‌టిసి క్రాస్ రోడ్స్, హైదరాబాద్.
**(CD 2) శ్రీ అక్కు శ్రీనివాస రావు తండ్రి శ్రీ ఎజి స్వామి,** వృత్తి: వ్యాపారం & M/s రెడ్ సఫైర్ రెస్టారెంట్ & బార్ భాగస్వామి, నివాసం: ఫ్లాట్ నం.2, బ్లాక్ 13, HIG II, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్-500044, మరియు ఇం.నెం.1-8-518/16, చిక్కడపల్లి, హైదరాబాద్-500020
**(CD 3) శ్రీ బందరం నారాయణ (మరణించారు) తండ్రి స్వర్గీయ బాగయ్య,** వృత్తి: వ్యాపారం & M/s రెడ్ సఫైర్ రెస్టారెంట్ & బార్ భాగస్వామి, నివాసం: ఇం.నెం.1-8-855/4, శ్రీ రాం నగర్ నల్లకుంట, హైదరాబాద్.
**(CD 4) శ్రీమతి ఎ.విశాలక్ష్మి భర్త ఎ.శ్రీనివాస రావు,** వృత్తి: గృహిణి, నివాసం: ఫ్లాట్ నం.2, బ్లాక్ 13, HIG II, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్-500044, మరియు ఇం.నెం.1-8-518/16, చిక్కడపల్లి, హైదరాబాద్-500020
**(CD 5) శ్రీ అక్కు లక్ష్మణ రావు తండ్రి ఎ.జి స్వామి,** బ్లాక్ 13, HIG II, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్-500044, వృత్తి: వ్యాపారం, నివాసం: ఇం.నెం.113/ఎ/4/2/1, సుదర్శన్ థియేటర్ లేన్, రామకృష్ణ మఠ్ మార్గ్, ఆర్‌టిసి క్రాస్ రోడ్స్, హైదరాబాద్-500020
**(CD 6) శ్రీ బి.గంగాధర్ తండ్రి స్వర్గీయ బి.నారాయణ,** నివాసం: ఇం.నెం.1-8-855/4, శ్రీ రాం నగర్ నల్లకుంట, హైదరాబాద్-44.
**(CD 7) శ్రీమతి బి.విజయలక్ష్మి తండ్రి స్వర్గీయ బి.నారాయణ,** నివాసం: ఇం.నెం.1-8-855/4, శ్రీ రాం నగర్ నల్లకుంట, హైదరాబాద్-44. **...సర్టిఫికెట్ డెటార్స్**

రికవరీ ఆఫ్ డెట్స్ డ్యూ టు బ్యాంక్స్ అండ్ ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్స్ యాక్ట్, 1993లోని సెక్షన్ 19(22) క్రింద గౌరవనీయ ప్రిసైడింగ్ ఆఫీసర్, డెట్స్ రికవరీ ట్రిబ్యునల్-II, హైదరాబాద్ వారిచే RP నం. 604 ఆఫ్ 2019 తేది: 31.08.2019 కలిగిన రికవరీ సర్టిఫికెట్ జారీ చేయబడింది.

సర్టిఫికెట్ డెటార్స్ నుండి ఆదాయ పన్ను చట్టం, 1961కు రెండవ మరియు మూడవ షెడ్యూల్స్ మరియు పైన తెలిపిన రికవరీ సర్టిఫికెట్‌లో నిర్దేశించిన **రూ. 78,84,831/-** (డెబ్బై ఎనిమిది లక్షల నలభై నాలుగు వేల ఎనిమిది వందల ముప్పై ఒక్క రూపాయలు మాత్రమే) మరియు వడ్డీ, వ్యయాలు మొదలగు వాటిని రాబట్టుకొనుట కొరకు RP నం. 604 ఆఫ్ 2019 లో రికవరీ ప్రొసీడింగ్స్‌ను దిగువ సంతకందారు ప్రారంభించారు, రికవరీ సర్టిఫికెట్‌కు అనుగుణంగా దీనితో జతపరచబడిన షెడ్యూలులో తెలిపిన తనఖా పెట్టిన/ జప్తుచేయబడిన ఆస్తి అమ్మకానికి దిగువ సంతకందారు ఉత్తర్వు జారీ చేసారు, మరియు M/s రెడ్ సఫైర్ రెస్టారెంట్ & బార్ & ఇతరుల నుండి (ఇంతకుముందు రాబట్టుకున్న ఏవేని మొత్తాలు తగ్గించుకుని) గౌరవనీయ ప్రిసైడింగ్ ఆఫీసర్, DRT వారిచే జారీ చేయబడిన రికవరీ సర్టిఫికెట్ ప్రకారం **19.08.2026** నాటికి (అమ్మకం కొరకు నిర్ణయించిన తేది) మొత్తం **రూ. 78,84,831/-** (డెబ్బై ఎనిమిది లక్షల నలభై నాలుగు వేల ఎనిమిది వందల ముప్పై ఒక్క రూపాయలు మాత్రమే) [డిక్రీ అమౌంట్] ప్లస్ వడ్డీ మరియు వ్యయం బకాయి చెల్లించాల్సి ఉంది.

ఏదైనా వాయిదా ఉత్తర్వు లేకపోతే సదరు ఆస్తి **19.08.2026**న ఇ-వేలం ద్వారా విక్రయించబడుతుందని మరియు సర్వీస్ ప్రొవైడర్ **"baanknet" ద్వారా వెబ్‌సైట్ https://baanknet.com** ద్వారా **"ఆన్‌లైన్ ఎలక్ట్రానిక్ బిడ్డింగ్" ద్వారా బిడ్డింగ్ జరుగుతుంది** అని ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది. **టోల్ ఫ్రీ సర్వీస్ ప్రొవైడర్ నెం. 8291220220, మెయిల్ ID: support.baanknet@psballiance.com.**

మరిన్ని వివరాలకు సంప్రదించండి: **శ్రీ సునీల్ పన్వార్ (చీఫ్ మేనేజర్),** పంజాబ్ & సింద్ బ్యాంక్, ARB హైదరాబాద్ శాఖ, మెట్రో ఎస్టేట్, అబిడ్స్, హైదరాబాద్, సంప్రదించు నెం.040-24754330/ 9855227889. **మెయిల్ ఐడి:** h1558@psb.bank.in. ఏదేని విచారణ, షెడ్యూలు ఆస్తి యొక్క తనిఖీ కొరకు, టైటిల్ డీడ్స్ కాపీల పరిశీలన కొరకు మరియు తాజా తాకట్టు రుణభారాల సర్టిఫికెట్‌ని పరిశీలించి మరియు వేలం అమ్మకం కొరకు ఉంచబడిన ఆస్తి యొక్క టైటిల్‌కు సంబంధించి తమ సొంత విచారణలు జరుపుకుని సంతృప్తి చెందగలరు.

**నియమాలు మరియు నిబంధనలు**

1. స్థిరాస్తి అమ్మకం షెడ్యూలులో తెలిపిన విధంగా ఉంటుంది.
2. రిజర్వు ధర **రూ. 1,60,00,000/-** దానికంటే తక్కువకు ఆస్తి విక్రయించబడదు.
3. ఆస్తులు **19.08.2026న ఉ. 11.00 గంటల నుండి ఉ.11.30 గంటల వరకు** వేలం వేయబడతాయి.
4. ఈ అమ్మకం నిర్వహించుటకు సంబంధించి ఏదైనా డ్యూటీ కలిగిన అధికారి లేదా ఇతర వ్యక్తి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా బిడ్ వేయరాదు. విక్రయించబడే ఆస్తిలో ఏదైనా ప్రయోజనాన్ని పొందరాదు లేదా పొందుటకు ప్రయత్నించరాదు. ఆదాయ పన్ను చట్టం 1961కి రెండవ షెడ్యూల్‌లో నిర్దిష్టపరచిన నిబంధనలు మరియు ఆదాయ పన్ను సర్టిఫికెట్ ప్రొసీడింగ్స్ రూల్స్ 1962, వాటి క్రింద ఏర్పరచిన నియమాలకు లోబడి అమ్మకం ఉంటుంది.
5. ఇ-వేలం అమ్మకం ప్రొసీడింగ్స్ నందు పాల్గొనుటకు తమ బిడ్లను దాఖలు చేయు ముందుగా వేలం అమ్మకం యొక్క వివరమైన నియమ నిబంధనలు, విధానం మరియు దరఖాస్తు ఫారం వగైరా కొరకు వెబ్‌సైట్: https://baanknet.com చూడాల్సిందిగా బిడ్డర్లను కోరడమైనది.
6. జతచేసిన షెడ్యూలులో తెలిపిన వివరాలు దిగువ సంతకందారు ఉత్తమ సమాచారం మేరకు తెలుపబడినవి. అయితే ఈ ప్రకటనలోని ఏదేని తప్పు, మిస్ స్టేట్‌మెంట్ లేదా వదిలివేసిన వాటికి దిగువ సంతకందారు బాధ్యత వహించరు.
7. అత్యధిక బిడ్డరు, అతను బిడ్ చేయుటకు న్యాయబద్ధంగా అర్హుడైనపుడు మరియు అతనిచే బిడ్ చేయబడిన మొత్తం రిజర్వు ధర కంటే తక్కువగా లేనప్పుడు మాత్రమే ఆస్తి యొక్క కొనుగోలుదారుగా ప్రకటించబడతాడు. ఆఫరు చేసిన ధర, ఆ విధంగా చేయుటకు సూచించదగినదిగా స్పష్టంగా తగినంతగాలేదని అనిపిస్తే దిగువ సంతకందారు అత్యధిక బిడ్ అంగీకారాన్ని తిరస్కరించవచ్చు.
8. **రిజర్వు ధరలో 10% బయానాను అకౌంట్ నెం. 15585040070003, అకౌంట్ పేరు: NEFT inward STP పార్కింగ్ అకౌంట్స్ మరియు IFSC కోడ్: PSIB0021558కు జమ అయ్యేలా RTGS/NEFT/ఫండ్స్ ట్రాన్స్‌ఫర్ ద్వారా లేదా "రిజిస్ట్రార్ DRT-2, హైదరాబాద్" పేరున డిమాండ్ డ్రాఫ్ట్/పే ఆర్డరు ద్వారా 17.08.2026లోగా బిడ్డరు డిపాజిట్ చేయాలి.**
9. గెలుపొందిన బిడ్డరు పై పేరా8లో తెలిపిన వివరాల ప్రకారం సదరు ఖాతాలో పాటకొట్టివేసిన మరుసటి రోజులోగా అనగా మ. 3.00 గం.లోగా 10% బయానా సర్దుబాటు చేసిన తరువాత కొనుగోలు ప్రతిఫలంలో 25% చెల్లించాలి. మరుసటి రోజు సెలవు రోజు లేదా ఆదివారం అయితే అపుడు మరుసటి పని రోజున చెల్లించాలి. కొనుగోలు ప్రతిఫలంలో మిగిలిన 75% వేలం తేది నుండి 15 రోజులలోగా చెల్లించాలి.
10. పై దానితోపాటు, కొనుగోలుదారు, రిజిస్ట్రార్, DRT-2 హైదరాబాద్ వారికి రూ. 1000/- వరకు 2% వంతున మరియు రూ. 1000/-కు మించిన మొత్తంపై 1% వంతున పౌండేజ్ ఫీజును "రిజిస్ట్రార్, DRT-2, హైదరాబాద్" పేరున DD ద్వారా డిపాజిట్ చేయాలి.
11. నిర్ణీత కాలంలోగా చెల్లింపు చేయుటలో విఫలమైతే అమ్మకం ఖర్చులు రాబట్టుకొన్న తరువాత దిగువ సంతకందారు తగినదని భావిస్తే డిపాజిట్‌ను ప్రభుత్వానికి జప్తు చేయవచ్చు మరియు విఫలమయిన కొనుగోలుదారు ఆస్తికి లేదా తరువాత విక్రయించబడే మొత్తంలో ఏదేని భాగానికి అన్ని క్లెయిమ్‌లు కోల్పోతారు. కొత్త అమ్మకం ప్రకటన జారీచేసిన తరువాత ఆస్తి తిరిగి విక్రయించబడుతుంది.
12. ఆస్తి కొరకు బిడ్డింగ్ చేసే కొనుగోలుదారు అమలులో ఉన్న వర్తించు చట్టాలను పాటిస్తున్నట్లు రూఢీ చేసుకోవాలి. ఆస్తి ఎక్కడ ఎలా ఉన్నది అలా మరియు అక్కడ ఏమున్నదో అది స్థితిలో విక్రయించబడును. బిడ్డర్లు ఆస్తికి సంబంధించి యాజమాన్యత, తాకట్టు రుణభారాలు, చార్జీలు లేదా పన్నులు వంటి చట్టబద్ధ బకాయిలకు సంబంధించి తమ స్వంత విచారణలు చేసుకోవాలి. బిడ్లు దాఖలు చేసేముందు బిడ్డర్లు తగు జాగ్రత్త వహించినట్లు భావించబడుతుంది.
13. ఆస్తి **"ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలా అక్కడ ఏమున్నదో అది ప్రాతిపదికన"** విక్రయించబడును.
14. సహేతుకతంగా లేదని కనుగొంటే ఏదైనా లేదా అన్ని బిడ్లను అంగీకరించు లేదా తిరస్కరించు లేదా ఏకారణం తెలుపకుండా ఏ సమయంలోనైనా వేలాన్ని వాయిదా వేయుటకు హక్కు దిగువ సంతకందారుకు కలదు.

**అమ్మబడుచున్న స్థిరాస్తుల వివరణ**

**శ్రీరామ్ నగర్, నల్లకుంట, స్లమ్ ఏరియా, లింగంపల్లి, హైదరాబాద్ వద్ద గల, 274.72 చ.గజాలు లేదా 229.66 చ.మీటర్లు విస్తీర్ణం, సర్వే నెం.26లో ఆవరణ నెం.2-1-390/1లో ఖాళీ ప్లాట్ యావత్తు, మరియు సరిహద్దులు: ఉత్తరం: రోడ్, దక్షిణం: పొరుగువారి గుడిసె, తూర్పు: ఖాళీ భూమి, పడమర: 6' వెడల్పు దారి.**

**ఇ-వేలం వివరాలు**

| వేలం తేది | బిడ్ల దాఖలుకు చివరి తేది | వేలం సమయం | రిజర్వు ధర | 10% బయానా మొత్తం | బిడ్ పెంపుదల మొత్తం |
|---|---|---|---|---|---|
| 19-08-2026 | 17-08-2026 | ఉ.11.00 గం. నుండి ఉ. 11.30 గం. | రూ. 1,16,00,000/- | రూ. 11,60,000/- | రూ. 1,00,000/- |

**02 జూలై 2026న** ఈ ట్రిబ్యునల్ యొక్క సీలు వెయ్యబడి నా చేతి ద్వారా ఇవ్వబడినది.

సం/- డి వి సుబ్రమణ్యం
రికవరీ ఆఫీసర్,
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్-2, హైదరాబాద్-500001


# నిరుద్యోగుల ఆశలపై నీళ్లు

## వందలాది ఖాళీలుంటే సర్కార్ ఇచ్చింది పదేనా?

- టౌన్‌ప్లానింగ్ విభాగంలో 200 పోస్టులకు కేవలం పదింటికే టీజీపీఎస్సీ నోటిఫికేషన్
- పోలీస్‌శాఖలో అదే తీరు..
- 20వేలు అడిగితే అనుమతిచ్చింది 7,347 కొలువులు మాత్రమే
- అరకొర ఉద్యోగ నోటిఫికేషన్లపై నిరుద్యోగుల ఆగ్రహం



హైదరాబాద్, జూలై 9 (నమస్తే తెలంగాణ): 'అంతన్నడు ఇంతన్నాడే గంగరాజు.. నట్టేట్ల ముంచుతున్నడే గంగరాజు' అన్న ఓ సినిమా పాటను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిజం చేస్తున్నారు. ఎన్నికల ముందు టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి నిరుద్యోగులకు పెద్ద ఎత్తున ఇచ్చిన హామీలను ఇప్పుడు ఒక్కొక్కటిగా తుంగలో తొక్కుతున్నారు. తొలి ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాల హామీ ఊసే ఎత్తడం లేదు, జాబ్ క్యాలెండర్ ప్రస్తావనే తేవడం లేదు. రెండున్నరేండ్లు దాటాక కూడా అరకొర ఉద్యోగ ఖాళీల భర్తీకి నోటిఫికేషన్లు ఇస్తూ నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లుతున్నారు. దీంతో రేవంత్ సర్కార్ ద్రోహం చేస్తున్నదని నిరుద్యోగులు మండిపడుతున్నారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలో రోజూ పలుచోట్ల నిరసనలకు దిగుతున్నారు. తెలంగాణ రాష్ట్ర టౌన్ ప్లానింగ్ విభాగంలో దాదాపు 200 వరకు అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. తాజాగా తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) విడుదల చేసిన నోటిఫికేషన్ నిరుద్యోగులను తీవ్ర నిరాశకు గురిచేసింది. మొత్తం ఖాళీల్లో 10 పోస్టుల భర్తీకి మాత్రమే ప్రభుత్వం అనుమతిస్తూ నోటిఫికేషన్ జారీచేసింది. జూలై 10 నుంచి ఆగస్టు 17 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తామని ప్రకటించినప్పటికీ, పట్టుమని 10 పోస్టుల కోసం లక్షలాది మంది పోటీ పడాల్సిన దుస్థితిని ప్రభుత్వం కల్పించిందని అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**పోలీస్ కొలువుల్లోనూ అదే కోత**

టౌన్‌ప్లానింగ్ విభాగమే కాకుండా, అత్యంత కీలకమైన పోలీస్ శాఖలోనూ నిరుద్యోగులకు ప్రభుత్వం మొండిచెయ్యి చూపింది. రాష్ట్రంలో సుమారు 20 వేల పోలీస్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వాలని అభ్యర్థులు వేడుకొంటున్నా, రేవంత్ సర్కార్ మాత్రం కేవలం 7,347 పోస్టులనే భర్తీ చేస్తామంటూ కోతలు విధిస్తున్నది. మొత్తం ఖాళీలను భర్తీ చేయకుండా, ఇలా నామమాత్రపు పోస్టులతో నోటిఫికేషన్లు ఇస్తూ నిరుద్యోగులను మభ్యపెట్టాలని చూస్తే ఊరుకొనేది లేదని, అన్ని ఖాళీలను చేర్చి తక్షణమే మెగా నోటిఫికేషన్లు విడుదల చేయాలని విద్యార్థి, నిరుద్యోగ సంఘాలు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాయి.

# ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోయినా పట్టదా..?

- గ్రామాల్లో నిర్లక్ష్యం వీడని విద్యుత్తు అధికారులు
- తిమ్మాపూర్‌లో రైతుల గోస
- ట్రాక్టర్ ఇంజిన్‌తో పొలానికి నీళ్లు

ఎల్లారెడ్డిపేట, జూలై 9: రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని పలు గ్రామాల్లో కరెంటు హెచ్చుతగ్గులతో మోటర్లు కాలిపోయి ఓ పక్కన రైతు తల్లడిల్లుతుండగా, మరోపక్క పలుచోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు చెడిపోయి రోజులు గడుస్తున్నా సంబంధిత యంత్రాంగం పట్టనట్టు వ్యవహరించడం విమర్శలకు తావిస్తున్నది. 12 రోజుల క్రితం అల్మాస్‌పూర్‌లోని రెడ్డి సంఘం భవనం వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోయిన ఘటన మరువక ముందే వారంక్రితం తిమ్మాపూర్‌లోని ఐదో నంబర్ ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోయింది. మరమ్మతులు చేయించాలని అధికారులకు విజ్ఞప్తి చేసినప్పటికీ నిర్లక్ష్యం చేస్తున్నారని, నారుమడులు ఎండిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. తిమ్మాపూర్ శివారులో గొల్లపల్లికి చెందిన దాసరి సత్తయ్యకు పదెకరాల వ్యవసాయ భూమి ఉండగా, వరి సాగుకోసం దుక్కి దున్ని నీళ్లు పారించాడు. మరోసారి నీళ్లుపారించేందుకు కరెంట్ లేకపోవడంతో గురువారం ట్రాక్టర్ ఇంజిన్ డైనమోను జనరేటర్‌లా ఉపయోగించాడు. కనీసం 6 రోజులైతేనే మొత్తం నీరు పారుతుందని, రోజుకు 15 లీటర్ల డీజిల్ అవుతున్నదని వాపోతున్నాడు. అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేయించాలని కోరాడు.



పొలంలో పారుతున్న నీళ్లు